


PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక



**విలేకరులు కావలెను.**

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256



ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 52 | ఆదివారం 31, మే 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari




ఖరీఫ్ సాగునీటి సరఫరాపై కీలక

## నిర్ణయాలు

- మే 31 నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీరు విడుదల చేయాలని నిర్ణయం
- నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధం కావాలని సూచన


మిగతా 2లో...


## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

- నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్ తయారీ
- ఉత్పత్తి, వ్యయం తదితర వివరాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్




2లో


మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా

## నిర్వహించడం లేదు

- సీయూఈటీ యూజీ 2026 పరీక్షలో సాంకేతిక లోపం
- పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం
- సమస్యను పరిష్కరించామని, అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ప్రకటన




2లో


మే 30 : దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం

# జర్నలిస్టు జీవితం దుర్భరం

## రిటైర్మెంట్ తర్వాత ఆమె బతుకే ఒక మానవీయ కథనం

**ఏపీ బ్యూరో(ప్రజా సీమ)**

ఉద్యోగ విరమణ తర్వాత చాలామంది జీవితాలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా గడిచిపోతాయి. కానీ కొందరి జీవితాలు మాత్రం రిటైర్మెంట్ తర్వాత అతలాకుతలం అయిపోతాయి. కడపకు చెందిన సీనియర్ జర్నలిస్టు ఇ.యం.సి. పద్మావతి జీవితం రెండో కోవకు చెందుతుంది. ఆమె డెస్క్ జర్నలిస్టుగా మొన్నటిదాకా ఇలాంటి ఎన్నో దీనగాథలను ఎడిట్ చేసింది. ఎవరైనా స్పందించి ఒక కుటుంబం గట్టెక్కాలని ఆశిస్తూ ఆ వార్తలను తీర్చిదిద్దింది. వాటికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రచురించింది. ఫలితంగా చాలా మందికి సహాయం అందింది. కానీ ఇప్పుడు ఆమె జీవితమే అలాంటి కథగా మారిపోయింది.

**కృంగదీసిన కుమారుని అనారోగ్యం**

2003 నుంచి 2022 వరకు ప్రజాశక్తి దినపత్రికలో కడప డెస్కులో జర్నలిస్టుగా పనిచేసిన పద్మావతి శ్రమ జీవి. కుటుంబాన్ని పోషించడంలో తన జీతానిదే ప్రధానపాత్ర. ఉద్యోగం ఉన్నంతకాలం కుటుంబాన్ని ఎలాగోలా నెట్టుకొచ్చింది. కానీ 58 ఏళ్ల వయసులో ఉద్యోగ విరమణ తర్వాత పరిస్థితులు గోరుచట్టుపై రోకటిపోటులా ఒక్కసారిగా మరింత దుర్భరంగా మారిపోయాయి. ఈ స్థితిలో అద సంస్థ ఆమెకు సపోర్టు ఇచ్చింది. కాంట్రాక్టు ఉద్యోగిగా తీసుకొంది. అయితే రెండో కుమారుని వైవాహిక జీవితంలో తలెత్తిన ఇబ్బందులు, అతనికొచ్చిన తీవ్రమైన అనారోగ్యం కారణంగా ఆమె క్రమేణా అప్పుల్లో కూరుకపోయింది. చిన్న సమస్యగా మొదలైన వ్యాధి వరుస శస్త్రచికిత్సల వరకు వెళ్లింది. కడప, తిరుపతిలో నయం కాకపోవడంతో వేలూరులోని సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స చేయించాల్సి వచ్చింది. ఇప్పటికీ ప్రతి నెలా వైద్య పరీక్షలు, మందుల ఖర్చులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆరోగ్య పరిస్థితి కారణంగా కుమారుడు ఉద్యోగం చేయలేక ఇంటికే పరిమితమయ్యాడు.

**అద్దె ఇంట్లోనే జీవితం**

రెండు దశాబ్దాలుగా జర్నలిస్టుగా పనిచేసిన ఆమెకు ఇప్పటికీ సొంత గూడు లేదు. అద్దె ఇంట్లోనే జీవనం కొనసాగిస్తోంది. నెలకు వచ్చే కొద్దిపాటి జీతంతో బతుకుబండి లాగలేకపోయింది. బంధుమిత్రులు చేతనైనంత సహాయం అందించారు. కానీ ఏ మూలకూ రాలేదు. కుమారుని వైద్య ఖర్చుల కోసం డ్వాక్రా రుణాలతోపాటు ఆన్ లైన్ అప్పులూ చేయక తప్పలేదు. నెలనెలా కంతులు కట్టడానికి చిన్నచిన్న కొత్త అప్పులు చేయడం, కొంతకాలం తర్వాత మరింత పెద్ద అప్పు చేయడం ఇలా ఆమె జీతం అప్పుల చట్రంలో ఇరుక్కుపోయింది. ఫలితంగా ఆమె జీవితం ఇప్పుడు అప్పులు, ఆందోళనలు, నిద్రలేని రాత్రుల మధ్య భారంగా గడుస్తోంది. 2003 నుంచి ఆమెను దగ్గరగా చూసినవారు "శ్రమ" అనేది ఆమె ఆత్మ బంధువని, ఏ ఒక్కరోజూ విడిచిపెట్టదని అంటూ ఉంటారు. ఆమె కూడా నవ్వి "నేను ఏ రోజూ నా కోసం బతకలేదు. సమయం అంతా సంసారం లాగడానికే సరిపోతోంది. ఇక నావల్ల కావడం లేదు. ధైర్యం తగ్గిపోతోంది" అని నిట్టూర్చుతోంది. "చచ్చిపోవడం మేలని చాలాసార్లు అనిపించింది. కానీ అది కూడా అందుబాటులో లేదు. ఎందుకంటే నేను చచ్చిపోవాలంటే నా మీద ఆధారపడి బతుకుతున్న మా ఆయనను, నా కొడుకుని కూడా చంపేయాలి. ఒక్కోసారి అది కూడా చేసేద్దామనిపిస్తుంది. కానీ దేవుడు అంత అన్యాయంగా ఉంటాడా? ఎప్పుడోకప్పుడు ఆదుకోకపోతాడా అనుకుంటూ అతి కష్టమ్మీద బండి లాక్కొస్తున్నాను" అని చెప్పుకొస్తోంది. అలా చెప్పేటప్పుడు ఆమె గొంతులో విశ్వాసం తొణికిసలాడుతుంది. అదే సమయంలో కళ్లలో నీళ్లు తన్నుకురావడం కూడా కనిపిస్తుంది. ఇది కేవలం ఒక మహిళ దీనగాథ కాదు. మహిళా జర్నలిస్టు జీవన పోరాటం.



**సహృదయ సంపన్నుల కోసం**

దేవుడు స్వయంగా దిగిరాడు. మనుష్యుల రూపంలోనే వస్తాడు. అలాంటి వాళ్ల కోసం ఆమె వివరాలు...

ఫోన్ నెంబర్ : 83416 19663. ఫోన్ పే, వాట్సాప్ అన్నింటికీ ఈ నెంబరే.

చిరునామా : ఇ.ఎం.సి. పద్మావతి, డోర్ నెం. 2/89-2, మారుతి నగర్, ఎస్పీ బంగ్లా దగ్గర, కడప నగరం, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్.



# సామాన్య కార్యకర్తకు వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం



పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్ :వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన పార్టీ పదవుల నియామకాలలో ఉమ్మడి అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం దండ్లోపల్లి గ్రామానికి చెందిన గద్దె వెంకటేష్‌ను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా యూత్ వింగ్ జనరల్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, సామాన్య కార్యకర్త అయిన తనను గుర్తించి ఈ బాధ్యత అప్పగించిన పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎంపీ మిథున్ రెడ్డి, రైల్వే కోడూరు ఇన్‌చార్జి కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, కొల్లం గంగిరెడ్డి, ధ్వజారెడ్డి రాయలసీమ యువజన కోఆర్డినేటర్ హేమంత్ రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎలకచర్ల శివారెడ్డి తదితర నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తోటి పార్టీ యువ నాయకులతో కార్యకర్తలతో సమన్వయం చేసి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని వెంకటేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు సమీప మిత్రులు మాట్లాడుతూ, గతంలో కూడా పుల్లంపేట మండల సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సేవలందించిన వెంకటేష్‌కు పార్టీ గుర్తింపు దక్కడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు.

# ఖరీఫ్ సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు

మే 30 : ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరాను క్రమబద్ధీకరించేందుకు నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు కందుల దుర్గేష్ తెలిపారు. ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ. 148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి సూచించారు.

# జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

నాయుడుపేట, మే 30 : ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే) ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. ప్లాంట్ ప్రతినిధులతో మాట్లాడిన పవన్ కల్యాణ్.. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవుతున్న వ్యయం, ప్లాంట్ రోజువారీ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఎంత? అలాగే యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలు ఏంటి? అనే అంశాలను ప్లాంట్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరంగా వివరించారు. ఈ పర్యటనలో కాకినాడలో నిర్మిస్తున్న జిందాల్ ప్లాంట్ ఆలస్యంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని ఆయన ప్రశ్నించగా... రాబోయే నవంబరు లోపు ఆ ప్లాంట్‌ను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జిందాల్ ప్రతినిధులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా.. ఇటువంటి విద్యుత్ ప్లాంట్ల వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం ఏ మేరకు పెరుగుతోంది, దాన్ని అదుపు చేయడానికి తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటనే దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీనిపై జిందాల్ ప్రతినిధులు స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణ మండలి ఏడాదికి నాలుగుసార్లు ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తోందని ఉపముఖ్యమంత్రికి వివరించారు.

# మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు. సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు. భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

# ఆత్మకూరులో మహానాడు విజయవంతం

### -అదరహో మహానాడు -కార్యకర్తల్లో నూతన ఉత్సాహం

### -టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి









సిద్ధవటం( ప్రజా సీమ ):ఆత్మకూరు నియోజకవర్గం లో ఈనెల 27, 28 తేదీలలో నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఊహించని రీతిలో తరలివచ్చి విజయవంతం చేశారని ఆత్మకూరు నియోజవర్గ టిడిపి పరిశీలకులు మోహన్ రెడ్డి పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రమైన సిద్ధవటంలో శనివారం మాట్లాడుతూ ఆత్మకూర్ నియోజవర్గం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి, ఆధ్వర్యంలో మంత్రి కుమార్తె కౌసల్యా రెడ్డి పర్యవేక్షణలో జరిగిన మహానాడు రెండు రోజులు కార్యక్రమానికి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారని వైసిపి ఫేక్ ప్రచారాలు మానుకోవాలని పేర్కొన్నారు నియోజకవర్గంలోని 11 క్లస్టర్లలో జరిగిన మహానాడు ను ప్రతిక్షణం అనువణువు దగ్గర ఉండి కార్యకర్తలతో మమేకమై రెండు రోజులు జరిగిన మహానాడు ను విజయవంతం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొనడం జరిగిందని ఆత్మకూరు నియోజకవర్గంలో జరిగిన మహానాడులో కార్యకర్తలను నూతన ఉత్సాహం మొదలైంది అని మహానాడును విజయవంతం చేసిన మంత్రివర్యులకు, కార్యకర్తలకు, ఎంపీకి, నాయకులకు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిటీ ఇన్చార్జిలో, బూత్ ఇన్చార్జిలు ల కు అభినందనలు తెలిపిన, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గం పరిశీలకులు, శనివారం మోహన్ రెడ్డి, తెలిపారు ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన 9 నెలలకే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకొచ్చి పేద బలహీన వర్గాల ప్రజలకు సమ న్యాయం చేసిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని తెలిపారు రాష్ట్ర మంత్రి ఆనం నారాయణరెడ్డి పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూటమి పార్టీ దే విజయం అని వైయస్సార్ పార్టీ ప్రజా ప్రతినిధులు మహానాడు పై తప్పులు ప్రచారాలు మానుకోవాలని లేకపోతే రాష్ట్ర ప్రజలు మిమ్మల్ని తరిమి కొడతారని తెలిపారు

# మిట్స్ విద్యార్థులకు ప్రత్యేక సాంకేతిక శిక్షణ కార్యక్రమం


### - హాజరైన టెక్నికల్ ట్రైనర్ హెచ్.ఎస్.శశాంక్






మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలోని మెకానికల్,ఈసీఈ మరియు ఈఈఈ విభాగాల విద్యార్థుల కోసం శనివారం ఆటోమొబైల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఏ.ఎస్.డి.సి) న్యూఢిల్లీ మరియు ఐచర్ మోటార్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక సాంకేతిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి) అమలు కార్యక్రమంలో భాగంగా ఐచర్ మొబైల్ ట్రైనింగ్ వ్యాన్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆధునిక వ్యాపార సంబంధిత వాహన సాంకేతికతలు,బీఎస్ – 4ఇంజిన్ వ్యవస్థలు,వాటి పనితీరు,సాంకేతిక లోపాల గుర్తింపు విధానాలు,నిర్వహణ పద్ధతులు మరియు పరిశ్రమలో ప్రస్తుతం అమలవుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై సమగ్ర అవగాహన కల్పించారు. ఐచర్ అర్.సి.డి.సి,మైసూర్‌కు చెందిన టెక్నికల్ ట్రైనర్ హెచ్.ఎస్.శశాంక్ శిక్షణను నిర్వహించి,ఐచర్ వాహనంలోని ఇంజిన్ నిర్మాణం,దాని పనితీరు,ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్ వ్యవస్థల పనివిధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించడంతోపాటు పరిశ్రమ అవసరాలు,ఉద్యోగ అవకాశాలు మరియు నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యతపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. అనంతరం యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమాల్ బాషా మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు కొత్త సాంకేతికతలను నేర్చుకోవడంపై ప్రత్యేక ఆసక్తి కనబరచాలని,పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలను సొంతం చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులలో ప్రయోగాత్మక జ్ఞానాన్ని పెంపొందించి,అకాడమిక్ అభ్యాసాన్ని పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేయడంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.భాస్కరన్,ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ మనివాలన్ గుణశేఖరన్,ఈసీఈ ఇంచార్జి విభాగాధిపతి డాక్టర్ సతీష్,అసిస్టెంట్ డైరెక్టర్ – ఇండస్ట్రీ రిలేషన్స్ డాక్టర్ పి.ఎం.బాలాజీ,కో–ఆర్డినేటర్లు డాక్టర్ ప్రవీణ్,పి.ఎం.డి రిజ్వాన్,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి పెద్దిరెడ్డికి వైసీపీ శ్రేణుల ఘనస్వాగతం



మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె,బి.కొత్తకోట పర్యటనల సందర్భంగా విచ్చేసిన మాజీ మంత్రి,పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆరోగ్యవరం వద్ద వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. అభిమానుల జై కొట్టే నినాదాలు,కార్యకర్తల సందడితో ఆ ప్రాంతం ఉత్సాహభరితంగా మారింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వైఎస్సార్సీపీ శ్రేణులు తమ అభిమాన నాయకుడికి ఘనంగా స్వాగతం పలికి పార్టీ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. అనంతరం స్థానిక నాయకులతో మాజీ మంత్రి సమావేశమై నియోజకవర్గంలోని రాజకీయ,ప్రజా సమస్యలపై చర్చించినట్లు సమాచారం. మదనపల్లె పర్యటన విజయవంతమైనట్లు పార్టీ నాయకులు,కార్యకర్తలు పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై ముందుకు సాగుతున్న నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అంటూ కార్యకర్తలు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. నియోజకవర్గ వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి,బాబ్ జాన్,దండాల రవిచంద్ర రెడ్డి తదితరులు మంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

# మహిళల భద్రత కోసమే ఆపరేషన్ దండాయన

## - నిందితులపై నిరంతర నిఘా ఉంచాలి
## - జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశం






మదనపల్లె (ప్రజా సీమ) : మహిళలు,బాలికల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ వారిపై జరిగే నేరాలకు పాల్పడే వారికి త్వరితగతిన శిక్షలు పడేలా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ దండాయన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ మీడియా సమావేశంలో తెలిపారు.రాష్ట్ర డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ ఆదేశాల మేరకు మహిళా అండ్ శిశు భద్రత విభాగం ఐజీపీ బి.రాజకుమారి ఐపీఎస్ పర్యవేక్షణలో రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ విధానాన్ని జిల్లాలో క్షేత్రస్థాయిలో వేగవంతం చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో మహిళలపై జరిగే అత్యాచారాలు,గృహ హింస,పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్లో నేరస్థులపై కఠిన నిఘా ఉంచేందుకు,నేరాల నియంత్రణకు శక్తి కార్యక్రమాల్లో భాగంగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో మహిళా భద్రతకు సంబంధించిన గణాంకాలను వెల్లడిస్తూ,జిల్లా ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకూ మహిళలపై నేరాలలో (క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్) 16 కేసుల్లో నిందితులకు కోర్టు ద్వారా కన్విక్షన్ (శిక్షలు) పడేలా పోలీస్ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో జిల్లా పోలీస్ యంత్రాంగం జీరో టాలరెన్స్ విధానం అవలంబిస్తోందని,నిందితులు ఎంతటి ప్రభావశీలురైనా సరే చట్టం ముందు లొంగాల్సిందేనని ఎస్పీ స్పష్టం చేశారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ఈ ఆపరేషన్ నిరంతరం కొనసాగుతుందని,మహిళల రక్షణ కోసం ప్రజలంతా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టం ద్వారా విచారణలో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి,నేరస్థులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని,సంచలనాత్మక కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదిలీ చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. జిల్లాలో పదేపదే నేరాలకు పాల్పడే పునరావృత నేరస్థులు,అనుమానితులపై నిఘా కోసం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సెక్సువల్ అఫెండర్ షీట్లు (ఎస్.ఓ.ఎస్) తెరిచామని,జియో ట్యాగింగ్,నైబర్ హుడ్ వాచ్ పద్ధతుల ద్వారా వారి కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు వెల్లడించారు. బాధితులకు తగిన రక్షణ కల్పిస్తూ,స్వచ్ఛంద సంస్థల సహకారంతో కౌన్సెలింగ్,ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని ఎస్పీ వివరించారు. కేవలం శిక్షించడమే కాకుండా నేరస్థుల్లో మార్పు తీసుకువచ్చేందుకు సామాజిక కార్యకర్తల భాగస్వామ్యంతో జిల్లావ్యాప్తంగా పరివర్తన సదస్సులు నిర్వహిస్తున్నామని ప్రింట్,ఎలక్ట్రానిక్,సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. చట్టాలపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో అవగాహన పెంచడంతోపాటు నేరస్థుల్లో భయం కలిగించేలా ఇటీవల మహిళలపై జరిగిన నేరాల్లో కోర్టులు విధించిన కఠినమైన తీర్పుల వివరాలను జిల్లాలోని అన్ని పాఠశాలలు,కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పోలీస్ అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి,మహిళా పోలీస్ స్టేషన్ సీఐ.జి.శంకర మల్లయ్య,కోర్ట్ మానిటరింగ్ ఇన్స్పెక్టర్ జె.ప్రసాద్ బాబు,రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె.సురేష్ కుమార్ రెడ్డి,డిసీఆర్ బి ఎస్ఐ.బి.సహదేవి ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రతిభావంతులకు కృత్రిమ అవయవాల పంపిణీ

## - ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే షాజహాన్ బాషా
## - పాల్గొన్న వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు మౌలాలి






మదనపల్లె (ప్రజా సీమ) : పట్టణంలోని స్థానిక చిత్తూరు బస్టాండ్ సర్కిల్ నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో ఒమేగా రెహాబ్ ఫెడరేషన్ బెంగళూరు వారి సహకారంతో మదనపల్లె ఫిజికల్ హ్యాండీ క్యాప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వికలాంగుల కోసం ఉచిత సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వ హించారు. వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు మౌలాలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరయ్యారు. ఇందులో లబ్ధిదారులకు అవసరమైన కృత్రిమకాలు,కృత్రిమ చేయి,చెవిటి మిషన్,వీల్ చైర్స్,చంక కర్రలు మొదలైనవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ సమాజంలో వైకల్యంతో ఇబ్బంది పడుతున్న వికలాంగుల సహాయార్థం ఒమేగా రెహాబ్ ఫెడరేషన్ బెంగళూరు వారు ముందుకొచ్చి వారికి అవసరమైన సహాయ పరికరాల వివరాలను కొలతలను తీసుకొని ఉచితంగా అందజేయడంపట్ల అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ప్రతి ఒక్కరు గౌరవంగా జీవించడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వికలాంగుల సంఘాన్ని అభినందించారు. అనంతరం వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు మౌలాలి మాట్లాడుతూ దివ్యాంగులు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని వారి సమస్యలకు పరిష్కారం చూపడం కోసమే ఈ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ వికలాంగుల సహాయ పరికరాలను గుర్తించి వారికి సహాయ పరికరాలు అందజేయడం ప్రశంసనీయమన్నారు. ఈ క్యాంపు ద్వారా సుమారు 53 మందికి దివ్యాంగులకు అవసరమైన పరికరాలను అందజేయడం జరిగిందన్నారు. టిడిపి దివ్యాంగుల విభాగం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు,టమోటా మార్కెట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఎస్.దినేష్ కుమార్ ఆధ్వర్యంలో 53 మంది వికలాంగులను గుర్తించి,కృతిమ అవయవాలు,సహాయ పరికరాలు అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టిడిపి దివ్యాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షులు వెంకటరమణ నాయుడు మాట్లాడుతూ దివ్యాంగులు గౌరవంగా జీవించడానికి ఒమేగా రెహాబ్ ఫెడరేషన్ బెంగళూరు వారు ముందుకు వచ్చి సహాయ,సహకారాలు అందించడం గొప్ప విషయమని తెలిపారు. చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రటరీ కవిత రాణి మాట్లాడుతూ తమ సంస్థలో కొనసాగుతున్న ఆనంద వృద్ధాశ్రమంలో వయోవృద్ధులకు అవసరమైన సహాయ పరికరాలను అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఒమేగా రెహాబ్ ఫెడరేషన్ బెంగళూరు డా.ఎస్. దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేకంగా దివ్యాంగుల కోసం ఈ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని ఇందులో 53 మందికి అవసరమైన సహాయ పరికరాలను అంద జేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం అధ్యక్షులు మౌలాలి,వైఎస్ఆర్సిపి మాజీ కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్,చైతన్య సర్వీస్ సొసైటీ అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ బాబు,జగదీష్,వెంకట రమణ నాయుడు,ఈశ్వరి,డాక్టర్ సురేష్ ట్రైనర్లు రేఖ,సవరణ,శరణ్య,వికలాంగులు పాల్గొన్నారు.

# నాగవరం చెన్నకేశవ స్వామి ఆలయ పూర్వ వైభవానికి టీటీడీ తోడ్పాటు అందించాలి : ఆకేపాటి ప్రతాప్ రెడ్డి.



రైల్వే కోడూరు (ప్రజా సీమ ): తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని చిట్వేల్ మండలం, నాగవరం గ్రామంలో వెలసిన పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకురావాలని గ్రామస్థులు, భక్తులు కోరుతున్నట్లు నాగవరం గ్రామానికి చెందిన ఆకేపాటి ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1228వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ ఆలయానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామికి సాక్షాత్తు తమ్ముడిగా భావించే శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం ఒకప్పుడు భక్తుల రద్దీతో కళకళలాడేదని పేర్కొన్నారు. సుమారు 12 సంవత్సరాల క్రితం ఇక్కడ నిర్వహించిన సిద్ధి యాగం 13 రోజుల పాటు వైభవంగా సాగిందని, తిరుమల తిరుపతి దేవస్థానం మరియు ఎండోమెంట్స్ శాఖ ఆధ్వర్యంలో 11 రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారని గుర్తు చేశారు. అయితే కాలక్రమేణా ఆలయంలో నిత్య పూజలు నిలిచిపోవడంతో ధూప, దీప, నైవేద్యాలు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామివారి పంచంలోహ విగ్రహాలను ఒక గదిలో భద్రపరచి ఉంచడం బాధాకరమని అన్నారు. ఇటీవల విగ్రహంలోని ఒక భాగం నుంచి రక్తాన్ని పోలిన ద్రవం కారుతున్నట్లు స్థానికులు గమనించారని, దీంతో భక్తుల్లో భయాందోళనలు నెలకొన్నాయని తెలిపారు. దివంగత టీటీడీ మాజీ చైర్మన్ ఆకేపాటి చెంగల్ రెడ్డి సోదరుడు ఆకేపాటి రజనీకాంత్ రెడ్డి, ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డి సహకారంతో ఆలయానికి ప్రహరీ గోడ, ఆర్చి తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయినప్పటికీ ఆలయ సంపూర్ణ అభివృద్ధికి మరింత సహకారం అవసరమని పేర్కొన్నారు. నాగవరం గ్రామంతో పాటు చుట్టుపక్కల 12 గ్రామాల ప్రజలకు ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచిందని, స్వామివారి విగ్రహాలను తిరిగి ప్రతిష్ఠించి నిత్య పూజలు, ధూప దీప నైవేద్యాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు టీటీడీ, ఎండోమెంట్స్ శాఖలు ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తొలగి భక్తులకు ఆధ్యాత్మిక విశ్వాసం పెంపొందాలంటే ఆలయంలో నిత్యారాధనలు పునఃప్రారంభించడం అత్యవసరమని అన్నారు. ఈ మేరకు గ్రామ ప్రజలు, భక్తులు, పెద్దలతో కలిసి సంతకాల సేకరణ చేపట్టి తిరుమల తిరుపతి దేవస్థానం మరియు ఎండోమెంట్స్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు మరియు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

# వైభవంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహేష్ నాయుడు పుట్టినరోజు వేడుకలు

## - శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు,కార్యకర్తలు
## - హాజరైన జునైద్ అక్బరీ,పఠాన్ ఖాదర్ ఖాన్,నాగూర్ వలి



మదనపల్లె (ప్రజా సీమ) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి,టి.సుండుపల్లి యువనేత చప్పిడి మహేష్ నాయుడు జన్మదిన వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు,మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తనయుడు జునైద్ అక్బరీ,రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్,ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్ వలి (షో అఫ్ శీను) హాజరై మహేష్ నాయుడుని శాలువా, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా నూతనంగా నిర్మించిన బస్టాండ్,బస్సు షెల్టర్‌ను ప్రముఖ నాయకులు ప్రారంభించి ప్రజలకుఅంకితంచేశారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్,నాగూర్ వలిలు మాట్లాడుతూ ప్రజల సమస్యలనుతనవిగా భావించి,అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న యువ నాయకుడు మహేష్ నాయుడు అని,ఆయన సేవాతపన,నాయకత్వ లక్షణాలు యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు. నిరంతరం పార్టీ బలోపేతానికి,కార్యకర్తల శ్రేయస్సు కోసం పరితపించే మహేష్ నాయుడు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక


# మాజీ మంత్రి పెద్దిరెడ్డిని సన్మానించిన మయూరి రఘునాథరెడ్డి

## - సీనియర్ నేతను ఆప్యాయంగా పలకరించిన పెద్దాయన





మదనపల్లె (ప్రజా సీమ) : బి.కొత్తకోట, మదనపల్లెలో ఎస్.ఐ.ఆర్ పై శనివారం వైకాపా బిఎల్ఓలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి,ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి,తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి,మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డిలు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మదనపల్లి పట్టణానికి చెందిన వైకాపా మేధావుల ఫోరం స్టేట్ జాయింట్ సెక్రెటరీ మయూరి రఘునాథరెడ్డి,వైకాపా ఎస్టీ సెల్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ ఆవుల మల్లికార్జునతోపాటు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా వీరిని మాజీమంత్రి ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తనకు రాష్ట్రస్థాయి పదవి కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా రఘునాథరెడ్డిని పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబం అత్యంత ప్రజాదరణ కలిగిన కుటుంబమని,నమ్మిన నాయకులు,కార్యకర్తల శ్రేయస్సు కోసం ఎల్లప్పుడూ ముందుంటారని స్పష్టం చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి అంటే తనకు ఎనలేని అభిమానమని,రాజకీయంగా తనకి ఆదర్శప్రాయుడని వెల్లడించారు. ఇప్పటినుండి పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేయాలని పెద్దిరెడ్డి సూచించినట్లు ఆయన తెలిపారు.

# క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా చమర్తి యూత్ క్రికెట్



వీరబల్లి (ప్రజా సీమ) క్రీడా స్ఫూర్తి పెంపొందించేలా చమర్తి జగన్మోహన్ రాజు యూత్ క్రికెట్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలియజేశారు. వీరబల్లి మండలం లో ఈ టోర్నమెంట్ లో గెలిచినా వారికి మొదటి బహుమతి కొండూరు శరత్ కుమార్ రాజు ఆధ్వర్యంలో 50000 రూపాయలు,రెండవ బహుమతి అమరేశ్వర్ రాజు 30000 రూపాయలు అందించమన్నారని వారు తెలియజేశారు. రాజంపేట టీడీపీ ఇంచార్జి చమర్తి జగన్ మోహన్ రాజు ఆదేశాను సారం 03-06-2026 జరగబోవు క్రికెట్ గ్రౌండ్ ను వీరబల్లి సింగిల్ విండో అధ్యక్షులు అమరేశ్వర రాజు,ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దు కృష్ణ రెడ్డి, శ్రీనివాస రాజు,వీరబల్లి కో - క్లస్టర్ రమేష్ రాజంపేట ఐటీడీపి జనరల్ సెక్రటరీ సాయి రాజు,ఐటీడీపి మండల కన్వీనర్ రమణ,జాఫర్, చందు, హరి తేజ, రామాంజి, సచిన్ లు పరిశీలించారు.

# గ్రామీణ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం

## - పినాక సాధికార సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు
## - మీడియాకు ఐఆర్ఎస్ బి.యాదగిరి వెల్లడి





మదనపల్లె (ప్రజా సీమ) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారిలో నైపుణ్యాలను మెరుగుపరచి ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే పినాక ప్రజాసాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకులు,ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ యాదగిరి తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక జ్ఞానోదయ విద్యాసంస్థలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను సందర్శించి విద్యార్థులకు ప్రత్యేక స్కిల్ ట్రైనింగ్ అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం,ఆంగ్ల భాషా ప్రావీణ్యం,జీవిత నైపుణ్యాల పెంపొందించడం కోసం వేసవిలో 21 రోజులపాటు ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా ఉచిత భోజన సౌకర్యంతోపాటు అవసరమైన అధ్యయన సామగ్రిని కూడా అందిస్తున్నామని వివరించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాలుగా మదనపల్లి, తిరుపతి,పలమనేరు,నగరి,అనంతపురం,ధర్మవరం,నంద్యాల ప్రాంతాల్లో ప్రతి ఏడాది మే నెలలో ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. పినాక ప్రజా సాధికార సంస్థ నుంచి శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు నేడు అత్యున్నత స్థాయిలో పదవులు అలంకరించి రాణిస్తున్నారని గుర్తుచేశారు. అంతేకాక ఇప్పటి వరకు 6,500 మంది విద్యార్థులు శిక్షణ తీసుకొని తద్వారా వివిధ హోదాల్లో స్థిరపడ్డారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నిరకాల పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణను అందించి విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చడమే తమ సంకల్పమన్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ దంపతులు బెల్లెరెడ్డి ప్రసాద్,బెల్లె హారతి యాదగిరిని శాలువా,పుష్ప గుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆర్మీ డైరెక్టర్ జనరల్,కనకదాస చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పరంధామ గౌడ,వల్లిగట్ల వెంకటరమణ,విశ్రాంత ట్రాన్స్‌కో అధికారి కృష్ణప్ప,ప్రసాద్,చలపతిలు పాల్గొన్నారు.

# బాలయ్యగారిపల్లెలో ఉపాధి హామీ పనుల పరిశీలన

## -పనులు నాణ్యతగా పూర్తి చేయాలని కూలీలకు ఎంపీడీఓ భాను ప్రసాద్ సూచన



కలకడ,(ప్రజా సీమ)కలకడ మండలంలోని బాలయ్యగారిపల్లె గ్రామపంచాయతీలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ భాను ప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న ఫీడర్ ఛానల్ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. శ్యామలకుంట నుంచి చిన్న ఒడ్డుకుంట వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర చేపడుతున్న ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించిన ఆయన, పనుల నాణ్యత, పురోగతి, కూలీల హాజరు తదితర అంశాలపై ఆరా తీశారు. అక్కడ పనిచేస్తున్న కూలీలతో నేరుగా మాట్లాడి వేతనాలు సకాలంలో వారి ఖాతాల్లో జమ అవుతున్నాయా, పనుల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. అనంతరం మస్టర్ రోల్స్‌ను పరిశీలించి, గ్రామంలో మరింత మంది కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని క్షేత్ర సహాయకుడికి సూచించారు. గ్రామ ప్రజలను చైతన్యపరిచి ఉపాధి హామీ పనులకు అధిక సంఖ్యలో హాజరయ్యేలా మొబిలైజేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "జలధార -- జలహారతి" కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. నీటి వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పరిరక్షణ, వ్యవసాయానికి నీటి లభ్యత పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టబడుతోందని తెలిపారు. అలాగే గ్రామంలో జరుగుతున్న అన్ని ఉపాధి హామీ పనులను జూన్ 15లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కూలీలు అందరూ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని, గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కలకడ ఏపీఓ సుజాత, ఈసీ నాగవేణి, క్షేత్ర సహాయకుడు మల్లికార్జునతో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

# వైభవంగా ముగిసిన భాగవత సప్తాహం



కడప (ప్రజాసీమ): కడప నగరంలోని అక్కాయపల్లి-చౌటిపల్లిలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో 14 రోజులుగా నిర్వహించిన భాగవత సప్తాహ పఠనం శనివారం వైభవంగా ముగిసింది. ఈ నెల 17వ తేదీన ప్రారంభమైన కార్యక్రమం 30వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ముగింపు సందర్భంగా ఉదయం మంత్రపుష్పంతో పాటు మహిళలు ఆలయం చుట్టూ కలశ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భాగవత పండితులు కడప సమీపంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పుష్పగిరి క్షేత్రానికి చేరుకుని పవిత్ర నదిలో స్నానం చేశారు. అంతకుముందు భాగవత పఠనాన్ని సంపూర్ణంగా ముగించారు. ఈ సందర్భంగా పులివెందులకు చెందిన మల్లికార్జున, కవిత దంపతుల నాలుగేళ్ల కుమారుడు రిషికేశి భగవద్గీత శ్లోకాలను అనర్గళంగా పఠించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాడు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో ఆలయ కమిటీ నిర్వాహకులు వడ్డేమాను రామలింగారెడ్డి, లక్ష్మీదేవి దంపతులు కీలక పాత్ర పోషించారు. భాగవత పండితులకు 14 రోజుల పాటు అల్పాహారంతో పాటు రోజుకు రెండు పూటల భోజన వసతి కల్పించారు. అలాగే భాగవత పండితులకు పంచె, చొక్కాలు, మహిళలకు చీరలు అందజేసిన రామలింగారెడ్డి దంపతులను సమాజం కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు బి. చిన్నశివారెడ్డి, ఉపాధ్యక్షులు ఎం. పాపిరెడ్డి, గొండిపల్లి నారాయణరెడ్డి, సమన్వయకర్త డి. గంగిరెడ్డి, సీమ మీడియా కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలయ్యగారి పల్లి పంచాయతీలో స్వచ్ఛ రథం సేవలను పరిశీలించిన ఎంపీడీవో



కలకడ (ప్రజా సీమ):స్వచ్ఛ రథం షెడ్యూల్‌లో భాగంగా శనివారం బాలయ్యగారి పల్లి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ రథం సేవలు ప్రజలకు అందించబడుతున్నాయి. ఈ సందర్భంగా కలకడ ఎంపీడీఓ ఆకస్మికంగా గ్రామంలో ఫీల్డ్ పర్యటన నిర్వహించి స్వచ్ఛ రథం పనితీరును పరిశీలించారు. స్వచ్ఛ రథం ద్వారా గ్రామంలో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత కార్యక్రమాలు ఎలా అమలవుతున్నాయో ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడి స్వచ్ఛ రథం సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు పొడి చెత్తను వేరుగా సేకరించి స్వచ్ఛ రథానికి అందజేస్తే ప్రభుత్వం అందించే ప్రోత్సాహక పథకాల ద్వారా అవసరమైన సరుకులు పొందే అవకాశం ఉంటుందని అవగాహన కల్పించారు. గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ రథం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, తడి చెత్త--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి అందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, శానిటరీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామ పరిశుభ్రత కోసం చేపడుతున్న స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని ప్రజలు అభినందించారు.

PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగు దినపత్రిక



# వైభవంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహేష్ నాయుడు పుట్టినరోజు వేడుకలు

## - శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు,కార్యకర్తలు
## - హాజరైన జునైద్ అక్బరీ,పఠాన్ ఖాదర్ ఖాన్,నాగూర్ వలి



మదనపల్లె (ప్రజా సీమ) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి,టి.సుండుపల్లి యువనేత చప్పిడి మహేష్ నాయుడు జన్మదిన వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి.

ఈ వేడుకలకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు,మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తనయుడు జునైద్ అక్బరీ,రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్,ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్ వలి (షో అఫ్ శీను) హాజరై మహేష్ నాయుడుని శాలువా,పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా నూతనంగా నిర్మించిన బస్టాండ్,బస్సు షెల్టర్‌ను ప్రముఖ నాయకులు ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్,నాగూర్ వలిలు మాట్లాడుతూ ప్రజల సమస్యలను తనవిగా భావించి,అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న యువ నాయకుడు మహేష్ నాయుడు అని,ఆయన సేవా తపన,నాయకత్వ లక్షణాలు యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు. నిరంతరం పార్టీ బలోపేతానికి,కార్యకర్తల శ్రేయస్సు కోసం పరితపించే మహేష్ నాయుడు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు ఛైర్మన్ కేకే చౌదరి,టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు బాలిశెట్టి హరిప్రసాద్,బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు,జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇన్‌చార్జ్ యల్లటూరి శ్రీనివాసరాజు,తానా మాజీ అధ్యక్షులు వేమన సతీష్,టీడీపీ,బీజేపీ,జనసేన పార్టీల నాయకులు,కార్యకర్తలు,అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామస్థాయి నుండి జాతీయస్థాయికి ప్రతిభ చాటిన క్రీడాకారుడు మద్దెల..!




రైల్వే కోడూరు ( ప్రజా సీమ ):అథ్లెటిక్స్ రంగంలో గ్రామీణ ప్రాంత యువత తమ ప్రతిభను చాటుకుంటూ జాతీయ స్థాయికి ఎదుగుతున్నారు. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం మంగంపేట గ్రామ ప్రాంతానికి చెందిన యువ అథ్లెట్ పరుగు పందాలలో అద్భుత విజయాలు సాధిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. మంగంపేట గ్రామానికి చెందిన ఎం. కోనయ్య, ఎం. ఆయిలమ్మల కుమారుడు మద్దెల లోకేశ్వర్ వృత్తిపరమైన క్రీడాకారుడిగా (ప్రొఫెషనల్ అథ్లెట్) రాణిస్తూ వరుస పథకాలతో దూసుకుపోతున్నారు. 2020 నుండి 2025 వరకు జరిగిన వివిధ క్రీడా పోటీలలో యువ క్రీడాకారుడు అసాధారణ ప్రతిభను కనబరిచారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో 6 సార్లు పాల్గొన్న మద్దెల లోకేష్ , వేర్వేరు విభాగాలలో స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందాలతో పాటు 4ఇ400 మీటర్ల రిలే పోటీలలోనూ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. ?రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ తన పరుగును కొనసాగించారు. భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో రెండు సార్లు, సౌత్ జోన్ నేషనల్స్ పోటీలలో ఒకసారి చొప్పున మొత్తం మూడు సార్లు జాతీయ వేదికలపై పాల్గొని ప్రతిభను చాటారు. గ్రామీణ నేపథ్యం నుండి వచ్చి, కఠోర శ్రమతో జాతీయ స్థాయి పోటీల వరకు ఎదిగిన ఈ యువ అథ్లెట్ ప్రదర్శన పట్ల స్థానికులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా సరియైన ప్రోత్సాహం ఉంటే జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి మంచి పేరు తీసుకువస్తానని పేర్కొన్నారు. ఇలాంటి యువ క్రీడాకారులకు సరియైన ప్రోత్సాహం లభిస్తే ఎన్నో విజయాలు సాధిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# పెట్రోల్,డీజిల్ ధరల పెంపుతో ఆటోలపై పెరుగుతున్న భారం

## - పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి
## - ఆటో ఫిట్నెస్ సర్టిఫికేట్ కోసం 150 కిలోమీటర్లు ప్రయాణించాలా
## - సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి విమర్శలు




మదనపల్లె (ప్రజా సీమ) : పట్టణంలోని స్థానిక ఎస్టియు కార్యాలయంలో శనివారం చిత్తూరు బస్టాండ్ ఆటోస్టాండ్ యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యూనియన్ గౌరవసలహాదారులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె. మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ ధరలు రోజువారి పెరుగడం వల్ల ఈ భారం పూర్తిగా ప్రజలపైన,ఆటో డ్రైవర్లపైన పడుతుందని,కేంద్ర ప్రభుత్వం గత 15 రోజులలో వ్యవధిలో ఎనిమిది రూపాయలు పెంచిందని,ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మనరాష్ట్రంలో మరెంత ఎక్కువ ధర ఉందని ఆరోపించారు. ఆటో ఫిట్నెస్ సర్టిఫికేట్ కోసం మదనపల్లి నుండి రాయచోటి లేదా చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంకి వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని,దీనివల్ల ఆటోలకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తీసుకోవడం చాలా ఖర్చుతో,శ్రమతో కూడుకున్న పనిగా ఏర్పడిందన్నారు. ఒక ఆటో ఫిట్నెస్ సర్టిఫికేట్ తీసుకోవడానికి 150 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉందంటే మదనపల్లి జిల్లా కేంద్రంగా అవ్వడం వల్ల ప్రజలకు ప్రయోజనం ఏముందన్నారు. ఇప్పటికైనా పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను తగ్గించాలని,ఫిట్నెస్ సర్టిఫికెట్లు మదనపల్లి జిల్లా కేంద్రంగానే ఇవ్వాలని,లేనియెడల వాహనదారులందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మునిరెడ్డి నాయక్,వెంకటరమణ,జైచంద్ర,గిరిబాబు,మల్లికార్జున,మంజునాథ్,సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

## - రైతన్నలు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది
## - కిసాన్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ వైస్ చైర్మన్ సింగం రామకృష్ణారెడ్డి
## - రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ప్రత్యేక పూజలు





మదనపల్లె (ప్రజా సీమ) : రైతు బాగుంటేనే - దేశం బాగుంటుందన్న విషయాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తెలుసుకోవాలని కిసాన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైస్ చైర్మన్ సింగం రామకృష్ణారెడ్డి సూచించారు. పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలమ్మ,కిసాన్ కాంగ్రెస్ పార్టీ జాతీయ కో-ఆర్డినేటర్ నీలం రమేష్ సూచనల మేరకు సింగం రామకృష్ణారెడ్డి అన్నమయ్య జిల్లాలో సుడిగాలి పర్యటన చేసి రైతుల సమస్యలను తెలుసుకొని,వారు పండించిన పంటలను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం అంగళు సమీపంలోని కనసానివారిపల్లిలో రైతులు సాగుచేసిన పొలాలను పరిశీలించారు.రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. మండుటెండలో వారు పడుతున్న కష్టాన్ని చూసి సింగం రామకృష్ణారెడ్డి చలించిపోయారు. ఉపాధి హామీ కూలీలకు ఏమాత్రం సౌకర్యాలు కల్పించకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వాపోయారు. కనీసం నీడ,తాగునీరు కల్పించకుండా,తక్కువ వేతనానికి ఉపాధి పనులు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలను ఆదుకునేలా వేతనాలు పెంచేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల పెట్రోల్,డీజిల్ ధరలు అమాంతంగా పెంచడం వల్ల రైతులు పంట పొలాలకు ఉపయోగించే ఎరువులు,క్రిమిసంహారక మందులు,టమోటా పంటకు వినియోగించే మల్చింగ్ పేపర్,కట్టెలు,దారం వంటి ధరలు చాలా పెరిగాయని రైతుల ద్వారా సింగం రామకృష్ణారెడ్డి తెలుసుకున్నారు. పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను తగ్గించాలని,పొలాలకు రైతులు ఉపయోగించే ప్రతి ఒక్క వస్తువులు,ఎరువుల తగ్గించాలని డిమాండ్ చేశారు. పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాగే నిర్లక్ష్యం చేస్తే రాబోయే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు స్వర్ణయుగంలాగా పాలన చేసి,ప్రతి రైతుకు అభివృద్ధి,సంక్షేమాన్ని అందించారని గుర్తు చేశారు. తిరిగి కాంగ్రెస్ పార్టీని కేంద్రంలోనూ,రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చేలా ప్రతి రైతు,కార్యకర్త కృషి చేయాలని కోరారు. తమ సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన సింగం రామకృష్ణారెడ్డిని స్థానిక రైతులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని కనసానివారిపల్లెలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో సింగం రామకృష్ణారెడ్డి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# యంత్ర పరికరాలకు దరఖాస్తులవెల్లువమంజూరైనయూనిట్లు తక్కువగా ఉండటంతో రైతుల్లో అసంతృప్తి

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ పథకాల కింద అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలకు పుల్లంపేట మండల రైతుల నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. మండలంలో వేలాది మంది రైతులు ఉన్నప్పటికీ, సబ్సిడీ కింద కేవలం రూ. 8 లక్షల విలువైన యంత్ర పరికరాలనే కేటాయించడంపట్లపలువురు రైతులుఅసంతృప్తివ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా ట్రాక్టర్లు, రోటావేటర్లు, పవర్ వీడర్లు, గడ్డి కోత యంత్రాలు, పవర్ టిల్లర్లు, చాఫ్‌కటర్లు, స్ప్రేయర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ, మండలానికి కేవలం ఒక మినీ ట్రాక్టర్, ఒక రోటావేటర్,10 స్ప్రేయర్లు మాత్రమే కేటాయించినట్లు సమాచారం. అదేవిధంగా ఎస్సీ రైతులకు రెండు పవర్ టిల్లర్లు, ఎస్టీ రైతులకు ఒక పవర్ టిల్లర్ మాత్రమే కేటాయించడంతో సంబంధిత రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మొత్తంగా మండలానికి 15 యూనిట్లు మాత్రమే మంజూరు కాగా, 89 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో అర్హుల జాబితాను రూపొందించి వ్యవసాయ శాఖకు ప్రతిపాదనలు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌ను వివరణ కోరగా, ప్రస్తుతం కేటాయించిన యంత్ర పరికరాలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించినవని తెలిపారు. రానున్న విడతల్లో మరింత ఎక్కువ సంఖ్యలో యంత్ర పరికరాలు వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

# పుల్లంపేటలో డెమో, ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు వినతిప్రయాణికుల ఇబ్బందులు దృష్ట్యా రైళ్లను నిలిపేలా చర్యలు తీసుకోవాలనివిజ్ఞప్తి

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్: పుల్లంపేట రైల్వే స్టేషన్‌లో గతంలో పలు రైళ్లు ఆగివని రైళ్లను తిరిగి నిలిపేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు బీజేపీ నాయకులకు వినతి పత్రం అందజేశారు. కరోనా కాలానికి ముందు పుల్లంపేట రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లు ఆగేవని, కరోనా అనంతరం కొన్ని రైళ్ల నిలుపుదల రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా రైల్వే కోడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలో విలీనం అయిన తర్వాత జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరాలు పెరిగాయని పేర్కొన్నారు. త్వరలో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, చేనేత కార్మికులు, వ్యాపారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పుల్లంపేట మండలంలో అరటి, బొప్పాయి వంటి అంతర పంటల సాగు ఎక్కువగా జరుగుతుండటంతో రైతులకు కూడా రైలు సౌకర్యం అవసరమని వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నంద్యాల డెమూ రైలు, గుంతకల్ వైపు నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ రైళ్లు పుల్లంపేటలో ఆగేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడుకు గ్రామస్తులు వందలాది మంది సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు.

# టీడీపీ వర్చువల్ మహానాడు విజయవంతం

## -రాష్ట్ర టిడిపి శ్రేణులకు అభినందనలు
## -స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు







సిద్ధవటం( ప్రజా సీమ) రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మహానాడు రాష్ట్రవ్యాప్తంగా ఒక పండుగ వాతావరణం ఎలా రెండు రోజులు కార్యక్రమం జరగడం ఎంతో సంతోషకరంగా ఉందని రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు తెలిపారు రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ఆదేశాల మేరకు రాజంపేటలో క్లస్టర్ నెంబర్ ఐదు నందు నన్ను అబ్జర్వర్ నియమించారు నియమించారు వర్చువల్ మహానాడును విజయవంతం చేసిన రాజంపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు తెలిపారు.రెండు రోజుల పాటు జరిగిన ఈ వర్చువల్ మహానాడులో పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఘనవిజయంగా నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా కృషి చేసి మహానాడును విజయవంతం చేశారని కొనియాడారు.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి నాయకత్వం, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి శ్రీ నారా లోకేష్ గారి యువ నాయకత్వంతో పార్టీ మరింత బలోపేతం అవుతోందని తెలిపారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహానాడులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ఒక తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని ఆయన అన్నారు “తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తే పార్టీకి అసలైన బలం... నాయకత్వం చూపిన మార్గంలో ముందుకు సాగుతూ పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలి” అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మహానాడు విజయవంతానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళా విభాగ నాయకులు మరియు అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కుట్రలు చేయడమే కూటమి ప్రభుత్వ ఎజెండా

## - ఓట్ల తొలగిపుతో ఎన్నికల ఫలితాలు తారుమారయ్యే ప్రమాదం
## - ఓటర్ల జాబితా పునఃపరిశీలనపై అప్రమత్తంగా ఉండండి
## - వైసీపీ రాయలసీమ రీజనల్ కో-ఆర్డీనేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు





మదనపల్లె (ప్రజా సీమ) : కుట్రలు చేయడమే కూటమి ప్రభుత్వ అజెండా అని,అప్రమత్తంగా ఉండాలి,ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా డిపాజిట్లు కూడా గల్లంతయ్యే ప్రమాదం పొంచి వుందటూ వైఎస్సార్సీపీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) అవగాహన కార్యాలయంలో పార్టీ ప్రముఖులు పేర్కొన్నారు.శనివారం మదనపల్లె మిషన్ కాంపౌండ్ లోని సీఎస్ఐ,జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన స్పెషన్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్.ఐ.ఆర్)లో భాగంగా చేపట్టిన ఓటర్ల జాబితా పునఃపరిశీలన ప్రక్రియపై పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో మదనపల్లె నియోజకవర్గం సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో (బీఎల్ఏ) బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి రీజనల్ కో–ఆర్డినేటర్,మాజీ మంత్రి,పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,జిల్లా అధ్యక్షుడు,రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డి,తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి,ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్)పై వారు బీఎల్ఏలకు అవగాహన కల్పించారు.ఓటర్ల జాబితా పునపరిశీలన ప్రక్రియపై ప్రత్యేక నిఘా ఉంచాలని,ఓట్ల తొలగింపు కారణంగా ఎన్నికల ఫలితాలే తారుమారయ్యే పరిస్థితి ఉంటుంది కనుక గ్రామాల్లో ఏ ఒక్క ఓటరూ మిస్ కాకుండా చూడాలని బీఎల్ఏలకు సూచించారు. ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు అని,ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటం బూత్ లెవెల్ ఏజెంట్ల బాధ్యత అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో వైఎస్సార్సీపీ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని,ఒక్క అర్హుడైన ఓటరు కూడా అన్యాయంగా జాబితా నుంచి తొలగింపుకు గురికాకుండా పార్టీ తరఫున నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు..ఇటీవల జరిగిన ఎన్నికలలో హేమాహేమీలకు ఎలాంటి పరిస్థితి నెలకొందో అందరూ చూశారు,మనం ఏమారితే మనకు అలాంటి పరిస్థితి రావచ్చంటూ చక్కగా వివరించారు. స్థానిక సంస్థలు ఎన్నికలు త్వరలోనే రానున్నాయని,ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు ఎన్.అనీషారెడ్డి,జింకా చలపతి,ఉదయకుమార్,బాబజాన్ మాజీ మునిసిపల్ చైర్మన్ మనుజా రెడ్డి,సీనియర్ నాయకులు శ్రీనాథ రెడ్డి,మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రెడ్డి,మేధావుల ఫోరం స్టేట్ జాయింట్ సెక్రెటరీ మయూరి రఘునాథ రెడ్డి,ఎస్టీ సెల్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ ఆవుల మల్లికార్జున,మునిశేఖర్, ఎస్.కె.ఇర్ఫాన్,సి హెచ్ రామచంద్రా రెడ్డి,మండల కన్వీనర్లు కేశవరెడ్డి,కరుణాకర్ రెడ్డి,కె.శ్రీనివాసులు రెడ్డి,మస్తాన్ ఖాన్,నరసింహా రెడ్డి,ఎన్.ఇర్ఫాన్ ఖాన్,నూర్ అజామ్,బిఏ.ఖాజా,తాజ్ బాషా (క్వాలిటీ నట్స్),శ్రీనివాసులు,ప్రసాద్ బాబు,శీలం రమేశ్,గ్రానైట్ మహేశ్,చిప్పిలి మల్లికార్జున రెడ్డి,కొత్తపల్లె నాగార్జున నాయుడు,ఎన్.నవాజ్,రామ్మోమోహన్ రెడ్డి,శ్రావణ్ రెడ్డి,తిమ్మయ్య,శ్రీకాంత్ రెడ్డి,చరణ్,మధు,సమద్,యూనస్, మజ్జిగ కేశవ యాదవ్,జబి,యసీన్, ఫక్రుద్దీన్,బీరంగి రేవతి,అబ్దుల్లా,నాగమణి,అమ్మాజాన్,శ్యామల,అపర్ణ,పలువురు ప్రజాప్రతినిధులు,అనుబంధ విభాగాల నాయకులు,బూత్ లెవెల్ ఏజెంట్లు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్మార్ట్ పోలీసింగ్ తో రాష్ట్రంలోనే కడప జిల్లా అగ్రగామిగా చేయాలి

## -రౌడీ లు, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలి
## -నేర సమీక్షా సమావేశంలో కడప జిల్లా ఎస్.పి షెల్కేనచికేత్ విశ్వనాధ్





కడప మే 30 (ప్రజాసీమ): స్మార్ట్ పోలీసింగ్ ఇండికేటర్స్ అయిన సి ఈ ఐ ఆర్, ఈ–సాక్ష్య, సి.సి.టి.ఎన్.ఎస్, ఈ– సమ్మన్స్ తదితర మాడ్యూల్స్ పై పట్టు పెంచుకుని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడం ద్వారా రాష్ట్రంలోనే అగ్రగామి జిల్లాగా నిలిపేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కడప జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి గ స్మార్ట్ పోలీసింగ్ పై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండి సంబంధిత నిపుణులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించిన అనంతరం జిల్లా ఎస్.పీ స్మార్ట్ పోలీసింగ్ మాడ్యూళ్ళపై సమీక్ష నిర్వహించారు. ఈ– ఆఫీస్ ను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ఎస్.పి ఆదేశించారు. డ్రోన్ టెక్నాలజీ ని వినియోగించి నేరాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను(బ్లాక్ స్పాట్స్) గుర్తించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్ అండ్ బి ఇతర శాఖల సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మలుపుల వద్ద అతి వేగం, వేగ నియంత్రణ లేకపోవడం వల్ల అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని జిల్లా ఎస్.పి ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిరంతరం నిఘా ఉంచాలన్నారు.రౌడీ లపై ఉక్కుపాదం మోపాలని, రౌడీ షీటర్ల కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. పదే పదే నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ తో పాటు జిల్లా బహిష్కరణ కు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లాడ్జి లలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని, విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, త్వరితగతిన ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యుల కు అప్పగించాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేసారు.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దొంగతనాలు జరగకుండా రాత్రి, పగలు గస్తీ ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. గతంలో జరిగిన ప్రాపర్టీ నేరాలలో సొత్తు రికవరీ చేయాలని, రికవరీ శాతం పెంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.మహిళలపై నేరాలు జరగకుండా శక్తి టీముల నిఘా పెంచాలని ఆదేశించారు.సమావేశంలో అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు , రాజంపేట ఏ.ఎస్.పి మనోజ్ రామనాథ్ హెగ్డే, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్ , కడప ఇంచార్జ్ డి.ఎస్.పి ఇ.బాలస్వామి రెడ్డి , జమ్మలమడుగు డి.ఎస్.పి కె.వెంకటేశ్వర రావు , ప్రొద్దుటూరు ఏ.ఎస్.పి విబు కృష్ణ ఐ.పి.ఎస్ , పులివెందుల డి.ఎస్.పి బి.మురళి నాయక్ , మైదుకూరు డి.ఎస్.పి జి.రాజేంద్రప్రసాద్ , సి.ఐ లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## వేసవి కాలంలో ఇవి తింటే ఫుల్ ఎనర్జీ వస్తుంది



వేసవి కాలం వచ్చేసింది. ఎండలు మార్చి నెల మొదలుకాకముందే ఎండలు దంచికొడుతున్నాయి. ఇలాంటి ఎండలో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా, చల్లగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. అలాగే ఈ కాలంలో ఏది పడితే అది తింటే ఆరోగ్యం కూడా దెబ్బ తింటుంది. హెవీ ఉష్ణోగ్రత, సూర్య క్రాంతి వల్ల శరీరానికి తగిన ఆహారం అవసరం. మనం తీసుకునే ఆహారాలు శరీర ఉష్ణోగ్రతను క్రమంలో ఉంచడంలో, ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో దోహదం చేస్తాయి. వేసవిలో జీర్ణవ్యవస్థ బలహీనంగా మారే అవకాశం ఉంటుంది. అలాగే శరీరంలో నీటి కొరత కూడా ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో కొన్ని ఆహార పదార్థాలు ఈ లోపాన్ని పరిష్కరించడంలో సహాయపడతాయి. ఇప్పుడు, వేసవిలో మన ఆరోగ్యానికి అనుకూలమైన ఆహారాల గురించి తెలుసుకుందాం.

పుచ్చకాయ: వేసవిలో తినడానికి పుచ్చకాయ అనువైన పండు. ఇందులో దాదావు 92% నీరు ఉండడం వల్ల ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. పుచ్చకాయలో విటమిన్ %జ, ూ%, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మానికి మెరుపు ఇస్తాయి. అలాగే, శరీర బలహీనతను తగ్గించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.

దోసకాయ:

వేసవిలో తినడానికి దోసకాయ కూడా చాలా మంచి ఆహారం. ఇందులో కూడా వాటర్ కంటెంట్ కొంచెం ఎక్కువ మొత్తంలో ఉంటుంది. కాబట్టి ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. దోసకాయలో యాంటీ ఆక్సిడెంట్లు మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటాయి, ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఈ పండులోని తక్కువ కేలరీలు, ఉండడం వలన దీనిని తింటే బరువు కూడా పెరగరు. పెరుగు: వేసవి కాలంలో పెరుగును ఆహారంలో భాగం చేసుకోవడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అలాగే రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పెరుగు శరీరాన్ని చల్లగా ఉంచుతుంది, అలాగే తాజాదనాన్ని కాపాడుతుంది. స్మూతీ, రైతా లేదా సలాడ్‌లో కూడా పెరుగు ఉపయోగించవచ్చు.

కొబ్బరి నీళ్లు: వేసవి అంటే మనకు గుర్తొచ్చేది కొబ్బరి నీళ్లు. ఇది సహజంగా శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉన్న పొటాషియం, సోడియం, ఖనిజాలు శరీరాన్ని చల్లగా ఉంచటంతో పాటు నిర్జలీకరణాన్ని నివారించడంలో సహాయపడతాయి.

పుదీనా: పుదీనా వేసవిలో శరీరాన్ని చల్లబరచడంలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పుదీనా శరీరంలోని జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పుదీనా టీ లేదా షర్బత్ తాగడం వల్ల కండరాలను రిలాక్స్ అవుతాయి. అలాగే ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు సహాయపడతాయి.

## గుజరాత్,మహారాష్ట్ర స్పెషల్ రెసిపి..






పెరుగుతో తయారు చేసే సంప్రదాయ భారతీయ డెజర్ట్ శ్రీఖండ్ ఎప్పుడైనా తిన్నారా? గుజరాత్, మహారాష్ట్రలో ఇది బాగా ప్రాచుర్యం పొందింది..పండుగలు,ప్రత్యేక సందర్భాలలో గుజరాత్, మహారాష్ట్రలో దీనిని ఇళ్లల్లో తయారుచేస్తుంటారు. శ్రీఖండ్ రుచికరమైనదమేకాకుండా ఆరోగ్యకరమైనది కూడా. ఇది కాల్షియం, ప్రోటీన్ ల గొప్ప మూలం. జీర్ణక్రియకు, రోగనిరోధక శక్తి పెంచడానికి,చర్మాన్ని మృదువుగా తేమగా ఉంచడానికి ఆరోగ్యానికి, జుట్టుకు ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. ఆరోగ్యానికి ఎంతో మేలుచేసే టేస్టీ శ్రీఖండ్ ని ఇంట్లో చాలా ఈజీగా తయారుచేసుకోవచ్చు. దీనిని తయారుచేయడానికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.

శ్రీఖండ్ తయారుచేయడానికి కావాల్సిన పదార్థాలు పెరుగు – 1 లీటరు చక్కెర – 1 కప్పు యాలకుల పొడి – 1 టీస్పూన్ కుంకుమపువ్వు – కొన్ని పలుకులు బాదం, పిస్తా, జీడిపప్పు – గార్నిష్ కోసం

శ్రీఖండ్ తయారీ విధానం –శ్రీఖండ్ తయారీ కోసం ముందుగా పెరుగును ఒక పలుచని గుడ్డలో వేసి దానిని రాత్రంతా వేలాడదీయాలి. దీని వలన పెరుగులోని నీరు మొత్తం పోయి చిక్కటి పెరుగు మిగులుతుంది. –ఇప్పుడు ఈ చిక్కటి పెరుగును ఒక గిన్నెలో వేసి ఇందులోనే చక్కెర, యాలకుల పొడిని వేసి కలపాలి. –చక్కెర పూర్తిగా కరిగే వరకు ఈ మిశ్రమాన్ని కలుపుతూ ఉండాలి.

–కుంకుమపువ్వును కొద్దిగా వేడి పాలలో కలిపి ఆ మొత్తాన్ని ఈ మిశ్రమంలో కలపాలి. –ఇప్పుడు ఈ శ్రీఖండ్ మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో 2-3 గంటలు చల్లబర్చాలి. –చివరగా బాదం, పిస్తా, జీడిపప్పులతో గార్నిష్ చేయండి. అంతే టేస్టీ శ్రీఖండ్ రెడీ. దీనిని చల్లగా తింటుంటే ఆహా ఏమి రుచిరా అని తీరాల్సిందే. –మీరు మీ రుచికి అనుగుణంగా వివిధ రకాల శ్రీఖండ్‌లను తయారు చేయవచ్చు. మామిడి పండ్ల గుజ్జుతో లేదా స్ట్రాబెర్రీ పండ్ల గుజ్జుతో, గులాబీ రేకులతో అయినా శ్రీఖండ్ తయారుచేసుకోవచ్చు.

## మనిషన్న వాడు ఉదయాన్నే తినాల్సిన బ్రేక్‌ఫాస్ట్



రోజులు మారుతున్నాయి, కొత్త కొత్త టెక్నాలజీ బయట పడుతుంది. అయినప్పటికీ మనుషులు ఆహారం విషయం మళ్ళీ వెనక్కి వెళ్తున్నారు. పాత కాలం నాటి ఆహారమే తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు. చాలా మంది మళ్ళీ మిల్లెట్స్ భోజనం తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అలాంటి మిల్లెట్స్‌తో ఉదయాన్నే ఉప్మా చేసుకుంటే ఆరోగ్యానికి ఆరోగ్యంతో పాటు రుచికరమైన భోజనం తిన్న ఫీలింగ్ కలుగుతుంది. కానీ చాలా మందికి ఈ అరికెలతో ఉప్మా ఎలా చేసుకోవాలి అనేది తెలియదు. అందుకే ఈ స్టోరీలో అరికెలతో ఉప్మా ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది వివరించాము. స్టోరీని పూర్తిగా చదివి, మీరు ట్రై చేయండి.

అరికెలతో ఉప్మా తయారీకి కావాల్సిన పదార్థాలు

1 కప్పు అరికెలు 1 ఉల్లిపాయ 2 పచ్చిమిర్చి 1/4 టీస్పూన్ పసుపు పొడి 1/2 టీస్పూన్ ఆవాలు 1 టీస్పూన్ మినపప్పు 1/2 టీస్పూన్ శనగపప్పు 1 టేబుల్ స్పూన్ వేరుశనగ 1 ఎండు మిర్చి 1/4 టీస్పూన్ జీలకర్ర

1 రెమ్మ కరివేపాకు 2 టీస్పూన్ నూనె రుచికి తగినంత ఉప్పు తాజా కొత్తిమీర

**తయారీ విధానం:** ముందుగా అరికెలను కడిగి పక్కన పెట్టండి(నానబెట్టవద్దు) ఆపై ఉల్లిపాయలు, ఎండుమిర్చి, కూరగాయలు తరిగి సిద్ధంగా పెట్టుకోండి. ఇప్పుడు బాణాలిలో నూనె వేడి చేసి, వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, ఎండు మిరపకాయలు వేసి చిటపటలాడనివ్వాలి. ఆపైన మినపపప్పు, శనగపప్పు వేసి కొద్దిగా రంగు మారే వరకు దోరగా వేయించాలి. పప్పులు రంగు మారాక అందులో కరివేపాకు, తరిగిన ఉల్లిపాయలు, మిరపకాయలు, కూరగాయలు వేసి వేయించాలి. కూరగాయలు ఉడికిన తర్వాత అరికెలు, రుచికి సరిపడా ఉప్పు వేసి మృదువుగా కలపండి. కొన్ని నిమిషాలు ఉడికించి, మంటను ఆపివేసి, కొత్తిమీర చల్లండి. అంతే ఎంతో రుచికరమైన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే అరికెల ఉప్మా సిద్ధమైనట్లే.

## తెలుగింటి అసలైన రోటి పచ్చడి ఇదే గురూ, రుచి మాత్రం వేరే లెవెల్‌లో ఉంటుంది, ఎలా చేసుకోవాలో తెలుసా?



మన రెండు తెలుగు రాష్ట్రాలతో ఉలవలతో చాలా ప్రత్యేకమైన వంటలు చేసుకుంటూ ఉంటారు. వాటిలో ఉలవ పచ్చడి చాలా ఫేమస్. చాలా ప్రాంతాల్లో దీనిని ఎంతో ఇష్టంగా చేసుకొని తింటుంటారు. ఈ ఉలవ పచ్చడి తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. అలాగే ఇది చాలా అంటే చాలా రుచికరంగా ఉంటుంది. పాతకాలం మనుషులు దీనిని ఎంతో పర్ఫెక్ట్‌గా చేస్తారు. కానీ ఈ కాలం మనుషులకు అది సాధ్యం కాదని చెప్పుకోవచ్చు. అయితే ఈ స్టోరీలో పాతకాలం పద్ధతిలో ఉలవ పచ్చడి ఎలా చేసుకోవాలి దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది తెలుసుకుందాం.

ఉలవ పచ్చడి తయారీకి కావాల్సిన పదార్థాలు ఉలవలు – 1 కప్పు ఎండు మిరపకాయలు – 5-6 చింతపండు – చిన్న నిమ్మకాయ సైజు అంత వెల్లుల్లి రెబ్బలు – 4-5 జీలకర్ర – 1/2 టీస్పూన్ ఆవాలు – 1/2 టీస్పూన్ కరివేపాకు – 1 రెమ్మ ఉప్పు – రుచికి తగినంత నూనె – 2 టేబుల్ స్పూన్లు.

ఉలవలు పచ్చడి తయారీ విధానం: ముందుగా ఉలవలను శుభ్రంగా కడిగి, నీటిలో 2-3 గంటలు నానబెట్టాలి. నానిన ఉలవలను కుక్కర్లో వేసి, కొద్దిగా నీరు పోసి 2-3 విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ఉడికించిన ఉలవలను చల్లారనివ్వాలి. ఇప్పుడు మిక్సీ జార్లో ఎండు మిరపకాయలు, చింతపండు, వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. రుబ్బిన మిశ్రమాన్ని ఉడికించిన ఉలవలకు కలపాలి. బాణాలిలో నూనె వేడి చేసి, ఆవాలు, కరివేపాకు వేసి తాళింపు చేసి పచ్చడిలో కలపాలి. అంతే, ఉలవల పచ్చడి రెడీ! దీనిని వేడి వేడి అన్నంలో కలుపుకొని తింటే ఆ రుచి అద్భుతంగా ఉంటుంది. ఒక్కసారి తింటే ఇంకోసారి జన్మలో దీనిని వదలరు.

# సినిమా న్యూస్



# రాజ్ కపూర్ - అమితాబ్ బచ్చన్ లా చరణ్ -తారక్!

భారతీయ చలనచిత్ర పరిశ్రమ ప్రాంతీయ హద్దులను దాటి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటోంది. ముఖ్యంగా దక్షిణ భారత సినిమాలు, అందులోనూ తెలుగు చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా సృష్టిస్తున్న ఇంపాక్ట్ సాధారణమైనది కాదు. ఒకప్పుడు బాలీవుడ్ మాత్రమే విదేశాల్లో భారతీయ సినిమాకు ప్రతిరూపంగా నిలిచేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గ్లోబల్ ఆడియన్స్‌ను ఆకట్టుకోవడంలో టాలీవుడ్ సినిమాలు సరికొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేస్తున్నాయి. ఈ మార్పును బాలీవుడ్ స్టార్ జాన్వీ కపూర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత అనుభవం పంచుకున్నారు.

విదేశాల్లో ప్రయాణిస్తున్నప్పుడు ఎయిర్‌పోర్ట్‌లో తనకు ఎదురైన ఓ ఆసక్తికర సంఘటనను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా భారతీయ సినిమాను గుర్తించడానికి సరికొత్త రెఫరెన్స్ పాయింట్ ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన -ఆర్ఆర్ఆర్-సాధించిన ప్రపంచ స్థాయి విజయం.. అందులోని కథానాయకులు రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ ల నటన విదేశీయులపై ఎంతటి బలమైన ముద్ర వేసిందో? జాన్వీ అక్షరాలా అంగీకరించారు. విదేశీ విమానాశ్రయాల్లో అంతర్జాతీయ వేదికలపై భారతీయుల గురించి చర్చ జరిగినప్పుడు ఆర్ ఆర్ ఆర్ చిత్రం ..ఆ ఇద్దరు స్టార్స్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయని జాన్వీ తెలిపింది.

ఒకప్పుడు భారతీయ సినిమా అంటే రాజ్ కపూర్, అమితాబ్ బచ్చన్ , షారుఖ్ ఖాన్ ల పేర్లు మాత్రమే విదేశీయులకు గుర్తొచ్చేవి. కానీ నేడు -నాటు నాటు- పాట ఆస్కార్ గెలుచుకోవడం.. అంతర్జాతీయ బాక్సాఫీస్ వద్ద తెలుగు సినిమాలు రికార్డులు సృష్టించడం తో గ్లోబల్ ఆడియన్స్ చూపు సౌత్ సినిమా వైపు మళ్లిందన్నారు. రామ్ చరణ్- ఎన్టీఆర్ లు గ్లోబల్ ఐకాన్స్‌గా ఎదగడం అనేది యావత్ భార తీయ సినీ రంగానికి గర్వకారణంగా మారిందని జాన్వీ అభిప్రాయపడింది. తాను ఏ దేశం వెళ్లినా? తనతో కలిసి పని చేసిన వారి గురించి తెలిసిన వారు కనబడితే తప్పక అడుగు తారని.. ఒకప్పుడు ఇలాంటి చర్చ రాజ్ కపూర్-అమితాబచ్చన్ ల గురించి జరిగేదని మామ్ శ్రీదేవి చెప్పేవారంది.

మొత్తానికి -ఆర్ఆర్ఆర్- చిత్రం బాక్సాఫీస్ రికార్డులను మాత్రమే తిరగరాయలేదు. ప్రపంచ పటంలో భారతీయ సినిమాకు ఓ కొత్త చిరునామాను అందించింది. రామ్ చరణ్- ఎన్టీఆర్ ల క్రేజ్ ఒక ప్రాంతానికో? దేశానికో ? పరిమితం కాకుండా గ్లోబల్ రెఫరెన్స్‌గా మారడం టాలీవుడ్ సాధించిన చారిత్రాత్మక విజయం. ఈ గ్లోబల్ స్టార్‌డమ్ రాబోయే రోజుల్లో మరిన్ని పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లకు అంతర్జాతీయ వేదికను సులభతరం చేసే అవకాశం లేకపోలేదు.





## కాజల్ గ్లామర్ డోస్ డబుల్.. లేటెస్ట్ లుక్ చూసి ఫ్యాన్స్ మంత్రముగ్ధులు!

టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ పెళ్లి, బాబు పుట్టిన తర్వాత కాస్త హోమ్లీగా కనిపిస్తూ వచ్చింది. కానీ తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే! గ్లామర్ డోస్ పెంచి సరికొత్త బోహో-చిక్ లుక్‌లో నెటిజన్ల మైండ్ బ్లాక్ చేసింది. 'Le temps de l'amour' (ప్రేమ కాలం) అంటూ ఫ్రెంచ్ క్యాప్షన్‌తో కాజల్ వదిలిన ఈ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఆ హాట్ అప్‌డేట్స్ చూద్దాం..

తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో కాజల్ అగర్వాల్ ఎవరూ ఊహించని రేంజ్‌లో స్టైలిష్‌గా కనిపించింది. ఆమె వైట్ కలర్ స్లీవ్‌లెస్ క్రోచెట్ ఓపెన్-నిట్ హాల్టర్ టాప్ ధరించింది. జియోమెట్రిక్ డిజైన్‌తో ఉన్న ఈ టాప్‌కు మ్యాచింగ్‌గా లైట్-వాష్ డిస్ట్రెస్డ్ డెనిమ్ షార్ట్స్ వేసుకుంది. ఈ మోడ్రన్ సమ్మర్ లుక్‌లో కాజల్ అందాలు నెటిజన్లకు అస్సలు నిద్రపట్టనివ్వడం లేదు. ఒకప్పుడు టాలీవుడ్‌లో కాజల్ హవా ఏ రేంజ్‌లో ఉందో అందరికీ తెలిసిందే. టాప్ హీరోల సినిమా వస్తోందంటే ఫస్ట్ ఛాయిస్ కాజలే ఉండేది. ఇక కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే ముంబై బిజినెస్‌మెన్ గౌతమ్ కిచ్లూను పెళ్లాడి, ఆ తర్వాత బాబుకు జన్మనిచ్చింది. ఇక ఫ్యామిలీ కోసం కొంతకాలం సినిమాలకు బ్రేక్ ఇవ్వడంతో అమ్మడి స్పీడ్ కాస్త తగ్గింది. పెళ్లి తర్వాత మళ్లీ మునుపటి రేంజ్ ఆఫర్లు అందుకోవడం అంత ఈజీ కాలేదు. కానీ, టాలెంట్ ఉన్న బ్యూటీని లక్ ఎక్కువ కాలం దూరం పెట్టలేదు కదా! రీసెంట్‌గా కాజల్ ఖాతాలో కొన్ని భారీ ప్రాజెక్ట్స్ పడ్డాయి. ఇక బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా వస్తున్న 'రామాయణం' మూవీలో రావణాసురుడి భార్య 'మండోదరి' లాంటి పవర్ ఫుల్ పౌరాణిక పాత్రను కాజల్ దక్కించుకుంది.

కేవలం బాలీవుడ్ మాత్రమే కాదు, టాలీవుడ్‌లోనూ క్రేజీ ఆఫర్ కొట్టేసింది. నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ సినిమాలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక వీటితో పాటు సమాజంలో జరిగే ఫెర్టిలైజర్స్ స్కామ్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న 'ది ఇండియా స్టోరీ' అనే సోషల్ థ్రిల్లర్‌లో కూడా లీడ్ రోల్ చేస్తోంది. ఒకపక్క పవర్‌ఫుల్ సినిమాలు చేస్తూనే, మరోపక్క ఇలాంటి హాట్ ఫోటోషూట్లతో తనేంటో నిరూపిస్తోంది కాజల్. పెళ్లై బాబు పుట్టినా తనలోని గ్లామర్ ఈసుమంతైనా తగ్గలేదని ఈ ఫోటోలతో ప్రూవ్ చేసింది. కెరీర్ పరంగా ఈ సెకండ్ ఇన్నింగ్స్ ప్రాజెక్టులు, ఈ రేంజ్ గ్లామర్ రచ్చ చందమామకు ఏ రేంజ్‌లో ప్లస్ అవుతాయో చూడాలి.

# సింపుల్ లుక్‌లోనూ స్పెషల్‌గా.. మృణాల్ ఠాకూర్ స్టైల్ వైరల్!





తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సీతారామం' సినిమాలో 'సీత'గా అలరించిన ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. సాంప్రదాయమైన కట్టుబొట్టుతో మన ఇంటి అమ్మాయిలా కనిపించిన ఈ బ్యూటీ, తాజాగా ముంబై వీధుల్లో అల్ట్రా మోడ్రన్ క్యాజువల్ లుక్‌లో దర్శనమిచ్చి అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. అక్కడ తన ఫ్రెండ్స్‌ను కలిసి హగ్గలిచ్చి సాగనంపిన ఈ బ్యూటీ స్టైలిష్ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ ఇంట్రెస్టింగ్ విశేషాలు చూద్దాం..

నాటితరం ఆడియన్స్‌కు జానకమ్మ అంటే అంజలీదేవి ఎలాగో.. నేటితరం యువతకు టాలీవుడ్ సీత అంటే వెంటనే గుర్తొచ్చే పేరు మృణాల్ ఠాకూర్. హను రాఘవపూడి దర్శకత్వంలో వచ్చిన 'సీతారామం' సినిమాలో సీతామహాలక్ష్మి పాత్రలో ఆమె నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. ఒక్క సినిమాతో ఓవర్‌నైట్ పాన్ ఇండియా సెలబ్రిటీగా మారి, కుర్రకారు క్రష్‌గా నిలిచింది. ముంబై వీధుల్లో మోడ్రన్ మ్యాజిక్: నిన్న మొన్నటివరకు లంగా ఓణీలు, శారీస్‌లో పద్ధతిగా కనిపించిన మృణాల్.. తాజాగా ముంబైలోని బాంద్రాలో సరికొత్త లుక్‌లో స్పాట్ అయింది. అడిడాస్ ఒరిజినల్స్‌కు చెందిన బ్లాక్ డెనిమ్ సెట్‌లో ఆమె మెరిసిపోయింది. ఇక చేతిలో పెద్ద హెడ్‌ఫోన్స్ పట్టుకుని, నడుచుకుంటూ వెళ్తుంటే అభిమానులు ఆమె స్టైల్‌కు ఫ్లాట్ అయిపోయారు. మృణాల్ వేసుకున్న ఈ డార్క్ డెనిమ్ అవుట్‌ఫిట్ చాలా స్పెషల్‌గా ఉంది. అడిడాస్ సిగ్నేచర్ త్రీ-స్ట్రైప్స్ డిజైన్‌తో ఉన్న 'అడికలర్ డెనిమ్ ట్రాక్ టాప్' మరియు దానికి మ్యాచింగ్‌గా ఉన్న 'అడికలర్ డెనిమ్ ఫైర్‌బర్డ్ షార్ట్స్' ఆమెకు పర్ఫెక్ట్ స్పోర్టీ అండ్ బోల్డ్ లుక్‌ను ఇచ్చాయి. సింపుల్‌గా ఉన్నా ఈ లుక్ చాలా కాస్ట్‌లీగా అనిపిస్తోంది. ఫ్రెండ్స్‌కు హగ్గలిచ్చి బైబై: ఈ క్యాజువల్ విజిట్‌లో మృణాల్ తన క్లోజ్ ఫ్రెండ్స్‌ను కలిసి కాసేపు సరదాగా ముచ్చటించింది. తిరుగు ప్రయాణంలో వారందరికీ ప్రేమగా హగ్గులు ఇస్తూ పంపించిన దృశ్యాలు అక్కడ ఉన్న కెమెరాలకు చిక్కాయి. ఎంత పెద్ద స్టార్ హీరోయిన్ అయినా తన స్నేహితులతో చాలా నార్మల్‌గా, క్లోజ్‌గా మూవ్ అయ్యే మృణాల్ పద్ధతిని ఫ్యాన్స్ మెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం మృణాల్ టాలీవుడ్, బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉంది. డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్ ధావన్, పూజా హెగ్డేలతో కలిసి ఆమె నటించిన సరికొత్త రొమాంటిక్ కామెడీ చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' జూన్ 5,న థియేటర్లలోకి రాబోతోంది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma